కేసీఆర్‌కు కోర్టు నోటీసులు

- మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటనపై పిటిషన్
- సెప్టెంబర్ 5న హాజరు కావాలన్న భూపాలపల్లి కోర్టు

జయశంకర్ భూపాలపల్లి, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటనపై భూపాలపల్లికి చెందిన నాగవెల్లి రాజలింగమూర్తి జిల్లా కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రాజెక్టులో అవినీతి అక్రమాలు జరిగాయని, ఈ ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని పెంచి ప్రజాధనం దుర్వినియోగం చేశారని, నాణ్యతాప్రమాణాలు పాటించలేదని పిటిషనర్ ఆరోపించారు. బొగ్గు పొరలున్న విషయాన్ని గుర్తించకుండా ఆ స్థలంలో ప్రాజెక్టు నిర్మించడంతో 7వ బ్లాక్‌లో ఒక పిల్లర్ కుంగిందని ఈ ఘటనపై విచారణ జరపాలని భూపాలపల్లి ప్రిన్సిపల్ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టుకు విజ్ఞప్తిచేశారు. భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌లో మేడిగడ్డ బరాజ్ కుంగిన ఘటనపై ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని రాజలింగమూర్తి పేర్కొన్నారు. కేసీఆర్‌తోపాటు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, అప్పటి ఇరిగేషన్ కార్యదర్శి రజత్‌కుమార్, అప్పటి సీఎంవో స్మితాసభర్వాల్, చీఫ్ ఇంజినీర్లు శ్రీధర్, హరిరాం, మెఘా సంస్థ యజమాని కృష్ణారెడ్డి, ఎల్‌అండ్‌టీ జనరల్ మేనేజర్ సురేశ్‌కుమార్‌పై అభియోగాలు మోపి విచారణ చేపట్టాలని పిటిషినర్ కోరారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన కోర్టు కేసీఆర్‌తోపాటు ఎనిమిది మంది సెప్టెంబర్ 5న విచారణకు హాజరు కావాలని నోటీసులు పంపించింది.

ప్రొఫెసర్ జయశంకర్ అడుగుజాడల్లోనే రాష్ట్రసాధన

- స్వరాష్ట్ర ప్రగతిలో సార్ స్ఫూర్తిని కొనసాగించాం
- ఆ ప్రగతిని కొనసాగించడమే ఆయనకు ఘననివాళి
- స్మరించుకున్న బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): ప్రొఫెసర్ జయశంకర్ జయంతి(నేడు) సందర్భంగా ఆయన తెలంగాణ కోసం చేసిన కృషి, త్యాగాన్ని రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. తొలిదశ నుంచి మలి దశ ఉద్యమం దాకా తెలంగాణ సాధన దిశగా ప్రొఫెసర్ జయశంకర్ చేసిన భావజాల వ్యాప్తి, దశాబ్దాలపాటు సాగిన ఉద్యమంలో వారు అందించిన పోరాటస్ఫూర్తిని కేసీఆర్ కొనియాడారు. వారి అడుగుజాడల్లో తాను మలిదశ ఉద్యమానికి సారథ్యం వహించి, చివరి దాకా శాంతియుత పద్ధతిలో, పార్లమెంటరీ పంథాలో ప్రజా ఉద్యమాన్ని కొనసాగించినట్టు చెప్పారు. చివరకు అరవై ఏండ్ల స్వయంపాలన ఆకాంక్షను నిజం చేసుకున్నామని కేసీఆర్ గుర్తు చేశారు. రాష్ట్ర సాధన అనంతరం ప్రజల మద్దతుతో మొట్టమొదటి ప్రభుత్వాన్ని ప్రొఫెసర్ జయశంకర్ స్ఫూర్తితోనే కొనసాగించామని కేసీఆర్ తెలిపారు. ఉద్యమాన్ని నడిపి గమ్యాన్ని చేరుకోవడంలోనూ, తదనంతరం పదేండ్ల అనతికాలంలోనే దేశానికే ఆదర్శవంతమైన పాలన అందించడంలోనూ వారి స్ఫూర్తి ఇమిడివున్నదని కేసీఆర్ పేర్కొన్నారు. స్వరాష్ట్రంలో సబ్బండ వర్గాలను, సకలజనులను అన్నిరంగాల్లో ముందంజలో నిలిపిన బీఆర్‌ఎస్ పాలన స్ఫూర్తిని కొనసాగిస్తూ, తెలంగాణను మరింతగా ప్రగతి పథంలో నడిపేలా కృషి చేయడమే వారికందించే ఘననివాళి అని కేసీఆర్ తెలిపారు.

ఉప ఎన్నికలు తప్పవు!

మొదటిపేజీ తరువాయి...

మణిపూర్ ఎమ్మెల్యేకు సంబంధించిన కేసుతో సహా పలు కేసుల్లో సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చిందని రాజ్యాంగ నిపుణుడు చెట్పుట్ ఆర్యమాసుందరం పార్టీ బృందానికి వివరించారు. గతంలో మాదిరిగా అనర్హత వేటు విషయంలో సుదీర్ఘకాలం నిర్ణయం తీసుకోకుండా స్పీకర్ నాన్చలేరని స్పష్టంచేశారు. ఈ సందర్భంగా ముగ్గురు ఎమ్మెల్యేల అనర్హత వేటుకు సంబంధించి హైకోర్టులో వేసిన పిటిషన్‌తోపాటు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేసిన విషయాన్ని, వాటికి సంబంధించిన పత్రాలను న్యాయ నిపుణులకు బీఆర్‌ఎస్ నేతలు అందజేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు మార్గదర్శకాలు స్పష్టంగా ఉన్నందున హైకోర్టు సైతం ఎక్కువ కాలం వాయిదా వేసే అవకాశం లేదని న్యాయ నిపుణులు అభిప్రాయపడ్డారు. హైకోర్టు నిర్ణయం త్వరగా ప్రకటించకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లే అవకాశం ఉన్నదని చెప్పారు.

ప్రజాక్షేత్రంలో బుద్ధిచెప్తాం

సుప్రీంకోర్టు తీర్పులతోపాటు న్యాయ కోవిదులు, రాజ్యాంగ నిపుణులు చెప్పున్న సలహాలు, సూచనల మేరకు న్యాయపోరాటం కొనసాగిస్తామని కేటీఆర్ తెలిపారు. నెలలో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు అంశం తేలిపోతుందని విశ్వాసం వ్యక్తంచేశారు. రాజ్యాంగ నిపుణులు, న్యాయ కోవిదులతో జరిగిన సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, గంగుల కమలాకర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

స్పీకర్ చర్యలు తీసుకోరా?

మొదటిపేజీ తరువాయి...

విచారణ పూర్తయ్యే వరకు స్పీకర్ నిర్ణయం తీసుకోరా? అని సందేహం వ్యక్తంచేసింది. ఇప్పటికే నెల గడిచిందని గుర్తు చేసింది. మరో మూడు నెలల వరకు కోర్టు తేల్చకపోతే అప్పటివరకు స్పీకర్ చర్యలు తీసుకోరా? అని ఏజీని నిలదీసింది. బీఆర్‌ఎస్ తరఫున ఎన్నికై కాంగ్రెస్ పార్టీలో చేరిన కడియం శ్రీహరి (స్టేషన్ ఘన్‌పూర్), దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్రావు (భద్రాచలం)పై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్‌రెడ్డి, కేపీ వివేకానంద, బీజేపీ శాసనసభాపక్ష నేత మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా దాఖలు చేసిన వ్యాజ్యాలపై హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీ విజయసేన్‌రెడ్డి సోమవారం మరోసారి విచారణ జరిపారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కోర్టులో పిటిషన్లు పెండింగ్లో ఉన్నంత కాలం స్పీకర్ నిర్ణయం తీసుకోరా అని అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డిని ప్రశ్నించారు. ఇవి రాజ్యాంగపరమైన విషయాలని, వాటిని కోర్టులు దాటవేయలేవని ఏజీ జవాబు చెప్పారు. స్పీకర్ వద్ద పిటిషన్ దాఖలు చేసిన పది రోజులకే పిటిషనర్లు హైకోర్టును ఆశ్రయించారని చెప్పారు. స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు కూడా ఆగలేదని, కనీస గడువు కూడా ఇవ్వలేదని తెలిపారు. రాజ్యాంగం ప్రకారం స్పీకర్ అత్యున్నత పదవని, స్పీకర్ నిర్ణయం తీసుకునే వరకు కోర్టులు జోక్యం చేసుకోరాదని, ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నాయని గుర్తుచేశారు. స్పీకర్ నిర్ణయం తీసుకున్నాక వాటిపై న్యాయ సమీక్షకు వీలుంటుందని తెలిపారు. హైకోర్టులో పిటిషన్ల కారణంగా స్పీకర్ నిర్ణయం తీసుకోవడం లేదంటూ గతంలో కడియం శ్రీహరి తరఫు సీనియర్ న్యాయవాది మయూర్‌రెడ్డి చెప్పారు. పిటిషనర్ల తరఫు సీనియర్ న్యాయవాదులు గండ్ర మోహన్‌రావు కల్పించుకుంటూ పిటిషన్ తీసుకోవడానికే స్పీకర్ కార్యాలయం నిరాకరించిందని చెప్పారు. హైకోర్టును ఆశ్రయించాకే స్పీకర్ కార్యాలయం పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై పిటిషన్లను తీసుకుందని గుర్తు చేశారు. నెల రోజుల తర్వాత కోర్టుకు వచ్చినట్లు చెప్పారు. స్పీకర్కు కోర్టులు ఆదేశాలు జారీ చేయవని, పదో షెడ్యూల్ ప్రకారం స్పీకర్ ట్రిబ్యునల్ చైర్మన్ హోదాలో పిటిషన్లను విచారణ చేస్తారని, ట్రిబ్యునల్ చైర్మన్కి కోర్టులు ఆదేశాలు జారీ చేయవచ్చునని చెప్పారు. స్పీకర్ తన ముందున్న పార్టీ ఫిరాయింపుల పిటిషన్లపై చర్యలు తీసుకోకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. ట్రిబ్యునల్ చైర్మన్గా స్పీకర్ నిర్దిష్ట గడువులోగా పిటిషన్లను విచారణ పూర్తి చేసి తుది నిర్ణయం చెప్పాలన్నారు. స్పీకర్కు ఉత్తర్వుల జారీ చేయరాదన్న పాత తీర్పులను ఉదహరిస్తున్నారని, తాజా సుప్రీంకోర్టు ఉత్తర్వుల ప్రకారం స్పీకర్ మూడు నెలల్లోగా తుది నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో హైకోర్టులు/సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవచ్చునని చెప్పారు. వాదనలు మంగళవారం కొనసాగనున్నాయి.

రవాణాశాఖలో కో.. అంటే కోటి!

- ఆర్టీఏలో విచ్చలవిడిగా మామూళ్ల దందా?
- 13 చెక్‌పోస్టుల్లో కోటికిపైగా వసూలు?
- లంచాలతో అనర్హులకు పదోన్నతులు?
- ప్రభుత్వ పెద్ద సన్నిహితుడి కనుసన్నల్లో వ్యవహారం?
- కేంద్రానికి, కాంగ్రెస్ పెద్దలకు ఫిర్యాదు?
- ఆ శాఖ ఉద్యోగుల పేర్లతో లేఖలు వైరల్

హైదరాబాద్, ఆగస్టు 5 (నమస్తే తెలంగాణ): చెక్‌పోస్టుల నుంచి రోజుకో రూ.కోటి.. నిబంధనలకు విరుద్ధంగా ఒక్కో ప్రమోషన్‌కు రూ.కోటి.. ఇలా రవాణాశాఖలో 'కో.. అంటే కోటి' అన్నట్టుగా మామూళ్ల దందా సాగుతున్నదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రాష్ట్ర రవాణాశాఖ మొత్తం ప్రభుత్వానికి చెందిన ఓ పెద్ద మనిషి సన్నిహితుడి చెరలో చిక్కిందని జోరుగా ప్రచారం సాగుతున్నది. స్వయంగా ఆ శాఖ ఉద్యోగులే ఈ ఆరోపణలు చేస్తున్నారని.. ఈ పంచాయితీ ఏకంగా ఢిల్లీకి చేరిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆ శాఖ ఉన్నతోద్యోగిపై కేంద్ర ప్రభుత్వానికి, ప్రభుత్వ పెద్ద సన్నిహితుడిపై కాంగ్రెస్ అధిష్ఠానానికి ఫిర్యాదు చేశారంటూ రెండు లేఖలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు, కాంగ్రెస్ పెద్దలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ కమిటీ సభ్యులకు ఆ లేఖలను పంపుతున్నట్టు పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత.. గతంలో రవాణాశాఖలో పనిచేసిన ఓ వ్యక్తి ప్రభుత్వ పెద్ద దగ్గర చేరారని ఆ లేఖల్లో పేర్కొన్నా రు. ఆయన రవాణాశాఖను తన గుప్పిట్లోకి తీసున్నారని, ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలోని 13 చెక్‌పోస్టుల నుంచి రోజూ 1.20 కోట్లు వసూలు చేస్తున్నారని సోషల్ మీడియా పోస్టుల్లో వెల్లడించారు. ఆ సొమ్ము ప్రభుత్వ పెద్ద సన్నిహితుడితో పాటు రవాణాశాఖలోని ఓ ఉన్నతాధికారికీ వెళ్తున్నాయని ఆరోపించారు.

మీటింగ్.. రైడింగ్..

సదరు ప్రభుత్వ పెద్ద సన్నిహితుడు.. రవాణాశాఖలో ఇద్దరికి అక్రమంగా పదోన్నతులు ఇచ్చేందుకు రూ.కోటి చొప్పున వసూలు చేశారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. సీనియార్టీ జాబితాలో వారు చాలా వెనుకబడి ఉండటంతో భారీ స్కెచ్ వేశాడని చెప్పుకుంటున్నారు. ఆ జాబితాలో ముందున్న వాళ్లతో ఓ మీటింగ్ పెట్టాడని, తనకు ఏం కావాలో స్పష్టంగా చెప్పి, బెదిరించి, 'మాకు ఇప్పుడు ప్రమోషన్ వద్దు' అని బలవంతంగా లేఖలు రాయించుకున్నాడని ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో ఒకరిద్దరు వ్యతిరేకించగా.. ఆ వెంటనే వారి వారి కార్యాలయాలపై దర్యాప్తు సంస్థల దాడులు జరిగాయని చెప్పుకుంటున్నారు. ఇది తెలిసి ఆ సంస్థ ఉన్నతాధికారి సైతం విస్తుపోయారని.. ఫిర్యాదు లేకున్నా ఎలా దాడులు జరిగాయని ప్రశ్నించినట్టు ప్రచారం జరుగుతున్నది. తనను ఎదిరిస్తే ఏం జరుగుతుందో చెప్పడానికి ఒక నమూనాగా ఈ దాడులు జరిపించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఇద్దరి ప్రమోషన్ ఫైల్ ఇప్పుడు తుదిదశకు చేరినట్టు ప్రచారం జరుగుతున్నది. ఈ విషయం తెలిసి ప్రభుత్వంలోని ఓ ప్రజాప్రతినిధి అసహనం వ్యక్తం చేసినట్టు చెప్పుకుంటున్నారు.

ఢిల్లీకి చేరిన పంచాయితీ

ఈ వ్యవహారం ఢిల్లీకి చేరినట్టు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నది. ఈ మేరకు తెలంగాణ స్టేట్ ఆర్టీఏ ఆఫీసర్స్ అండ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పేరుతో రెండు లేఖలు చక్కర్లు కొడుతున్నాయి. ఒకదానిలో రవాణాశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారిపై డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ (డీవోపీటీ)కి ఫిర్యాదు చేసినట్టు పేర్కొన్నారు. ప్రభుత్వ పెద్ద సన్నిహితుడి దయతో తాను ఆ ఉద్యోగంలో చేరినట్టు ఉన్నతాధికారి పదే పదే జపం చేస్తున్నారని, పూర్తిగా ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని అందులో ఆరోపించారు. ఈ లేఖను సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్‌కూ పంపినట్టు తెలిపారు. మరో లేఖను కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీకి రాసినట్టు వెల్లడించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఓ వ్యక్తి ప్రభుత్వంలోని అత్యంత కీలక వ్యక్తి దగ్గర పీఏగా చేరారని పేర్కొన్నారు. ఆయన ఓ చిరుద్యోగి అని, ప్రస్తుతం తాను ఉన్న స్థానాన్ని అడ్డుపెట్టుకొని మొత్తం రవాణాశాఖనే గుప్పిట్లోకి తీసుకున్నారని ఆరోపించారు. ఆర్టీఏ చెక్‌పోస్టులు, అధికారులకు టార్గెట్లు పెట్టి మరీ వసూళ్ల దందా చేస్తున్నారని, దీనిపై విచారించి, చర్యలు తీసుకోవాలని ఆ లేఖలో కోరారు.

లోకం పోకడ



వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	34.0°c	23.9°c
రంగారెడ్డి	33.9°c	21.7°c
నల్లగొండ	33.0°c	23.4°c
హైదరాబాద్	32.9°c	24.0°c
వరంగల్	32.0°c	25.0°c
మెదక్	31.8°c	22.2°c
మహబూబ్‌నగర్	31.0°c	23.0°c
ఖమ్మం	31.0°c	25.0°c
నిజామాబాద్	30.7°c	23.7°c
కరీంనగర్	30.0°c	26.0°c

రుణమాఫీ కాని రైతులు లక్షల్లో

మొదటిపేజీ తరువాయి...

ఉంటారని చెప్పారు. 83748 52619 నంబర్‌కు రైతులు తమ సమగ్ర వివరాలను పంపించాలని సూచించారు. రుణం తీసుకున్న తేదీ, రుణం తీసుకున్న మొత్తం, పట్టదారు పాసు పుస్తకం, బ్యాంకు, జిల్లా, మండలం, గ్రామం తదితర వివరాలను పంపించాలని సూచించారు. వీటన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రుణమాఫీ అయ్యేవిధంగా ఒత్తిడి తెస్తామని చెప్పారు. సోమవారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని రైతాంగానికి కాంగ్రెస్‌పై భ్రమలు తొలిగిపోయాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రైతుల సంఖ్యను ప్రభుత్వం తగ్గించి చూపుతున్నదని మండిపడ్డారు. పంట రుణాలు తీసుకున్న రైతుల వివరాలను మొత్తం బయటపెట్టాలని డిమాండ్ చేశారు. అరకొరగా రుణమాఫీ చేసి అంతా అయిపోయిందని భ్రమింపచేసే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 60 లక్షల మంది పంట రుణాలు తీసుకుంటే కేవలం 16 లక్షల మందికి రూ.12 వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో తొలి విడతలో 39 లక్షల మంది రైతులకు రూ.లక్ష వరకు రుణాలను మాఫీ చేశామని, రెండో విడతలో రూ.19 వేల కోట్లకుగాను రూ.13 వేల కోట్ల రుణం మాఫీ చేశామని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండు విడతల రుణమాఫీలో చూపిస్తున్న రైతుల సంఖ్య 17 లక్షల మాత్రమేనని, రైతుల సంఖ్య తగ్గిపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

రైతుల వివరాలపై గోప్యత ఎందుకు?

ప్రభుత్వం రైతుల వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచడంలో మతలబు ఏమిటని నిరంజన్‌రెడ్డి నిలదీశారు. కేసీఆర్ హయాంలో రైతుబంధు కింద ఒక్క విడతలో ఇచ్చిన మొత్తమే రూ.7,500 కోట్లు ఉన్నదని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల ప్రకారం రైతుభరోసా కింద రైతులు, రైతు కూలీలు, వ్యవసాయ కూలీలకు రూ.30 వేల కోట్లు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పారు. రైతుబంధు, రైతుభరోసా ఎగ్గొట్టి రుణమాఫీ అంటూ మోసం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక్కొక్క విడత రుణమాఫీకి రూ.100 కోట్లు, రూ.200 కోట్లతో పత్రికా ప్రకటనలు విడుదల చేశారని చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో ప్రకటనలు ఇస్తామంటే ప్రభుత్వం తరపున వద్దు అనవసర వ్యయం అంటూ కేసీఆర్ వారించేవారని చెప్పారు. రైతుభరోసాపై క్యాబినెట్‌లో ఎందుకు చర్చించలేదు? శాసనసభలో ఎందుకు ప్రకటించలేదు? అని నిలదీశారు.

రుణమాఫీపై చర్చకు సిద్ధమా?

గ్రామాల్లో రైతులు బ్యాంకుల చుట్టూ తిరుగుతూ పడిగాపులు గాస్తున్నారని, చిన్న,చిన్న కారణాలతో రుణమాఫీ చేయడం లేదని నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. పట్టాదారు పాస్‌పుస్తకం ఉంటే రుణమాఫీ అని సీఎం చెప్తున్నారని, పట్టాదారు పాస్‌పుస్తకం ఉండి రుణమాఫీ కానీ వాళ్లపై చర్చకు ప్రభుత్వం సిద్ధమా? అని సవాలు చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో రైతులు పడ్డ కష్టాల నుంచి బయటపడేసేందుకు బీఆర్‌ఎస్ హయాంలో కేసీఆర్ రుణమాఫీ చేశారని, కానీ కాంగ్రెస్ అత్యంత తక్కువ సమయంలో తనను నమ్మిన రైతాంగాన్ని మోసం చేసిందని చెపోపారు.

632 మందిలో 14మందికి మాఫీ: కేపీ వివేకానంద

రైతు రుణమాఫీ, రైతు భరోసాపై శాసనసభలో చర్చ జరపకుండా కాంగ్రెస్ పార్టీ పారిపోయిందని ఎమ్మెల్యే కేపీ వివేకానంద ఎద్దేవా చేశారు. ఈ విషయంలో సీఎం, డిప్యూటీ సీఎం, వ్యవసాయ మంత్రి ఎలాంటి స్పష్టత ఇవ్వలేదని చెప్పారు. తన నియోజకవర్గంలోని భౌరంపేట పీఏసీఎస్‌లో 632 మంది రైతులు రుణాలు తీసుకుంటే మొదట విడతలో 11 మందికి, రెండో విడతలో ముగ్గురికి మాత్రమే రుణమాఫీ జరిగిందని తెలిపారు. రైతుభరోసా, రుణమాఫీపై ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వబోమని హెచ్చరించారు. బీఆర్‌ఎస్ హయాంలో వ్యవసాయరంగం కోసం ఒక నిబద్ధతతో పనిచేశామని, దానికి కాంగ్రెస్ తూట్లు పొడుస్తున్నదని మండిపడ్డారు.

తెలంగాణ భవన్‌లో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో ఎమ్మెల్యే వివేకానంద, బీఆర్‌ఎస్ నేత ఇబ్రహీం

5 గంటల్లోనే 15 వేల ఫిర్యాదులు

రైతు రుణమాఫీపై బీఆర్‌ఎస్ ఏర్పాటుచేసిన ప్రత్యేక సెల్‌కు అనూహ్య స్పందన లభించింది. వాట్సాప్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చిన ఐదు గంటల్లోనే 15 వేల ఫిర్యాదులు రావడం గమనార్హం. రూ.లక్షన్నరలోపు రుణాలు మాఫీ కాని రైతులు 83748 52619 వాట్సాప్ నంబర్‌కు పంపించాలని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం మధ్యాహ్నం సూచించగా, సాయంత్రం కల్లా రైతుల నుంచి ఫిర్యాదులు పోటెత్తాయి. తమకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో వ్యవసాయ, బ్యాంకు అధికారులు సమాధానాలు చెప్పడంలేదని మెసేజ్‌లో తెలిపారు. పేర్లలో చిన్న చిన్న పొరపాట్లు ఉన్నాయంటూ రుణమాఫీ చేయడం లేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. రుణమాఫీ కటాఫ్ తేదీని 2024 మార్చి 31కి మార్చాలని కొందరు రైతులు కోరారు. మరికొందరు బంగారం కుదవ పెట్టి పంట రుణం తీసుకున్న రుణాల సంగతిపై కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని విజ్ఞప్తి చేశారు. ఒకే ఆధార్ నంబర్‌ను ఇద్దరికి లింక్ చేయడంతో ఆ రైతు రుణమాఫీ పొందలేకపోయాడనే ఫిర్యాదులు కూడా వచ్చాయి. తనకు రూ.75 వేలు మాఫీ చేశారని, కానీ, మరో రూ.10 వేలు కడితేనే రుణమాఫీ చేస్తామంటున్నారని ఒక రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

బీఆర్‌ఎస్ వాట్సాప్‌కు వచ్చిన కొన్ని మెసేజ్‌లు

- వనపర్తి జిల్లా పానగల్ మండలం చిక్కేపల్లి గ్రామానికి చెందిన గంగస్వామి డీసీసీబీ బ్యాంకు ద్వారా రూ. 1.20 లక్షల రుణం రుణం తీసుకున్నాడు. ఇప్పటివరకు రుణమాఫీ కాలేదు. ఆ ఇంట్లోని కుటుంబసభ్యులు ఎవ్వరికీ మాఫీ కాలేదు.
- నల్లగొండ జిల్లా నిడమనూరు మండలానికి చెందిన రైతు సెంట్రల్ బ్యాంకులో రూ.1,07,856 రుణం తీసుకున్నాడు. ఆయనకు రేషన్‌కార్డు లేదని మాఫీ చేయలేదు. ఈ విషయాన్ని అధికారులు ఆ రైతుకు చెప్పారు.
- నిజామాబాద్ జిల్లా బిక్నూర్ మండలం పెద్ద మల్లారెడ్డి గ్రామానికి చెందిన రైతు గుడిసె బాలవ్‌కు జూలై 18న రూ.44,785 తెలంగాణ గ్రామీణ బ్యాంకులో జమ అయినట్టుగా సీఎం పేరుతో మెసేజ్ వచ్చింది. ఆ రైతు బ్యాంకుకు వెళ్తే ఆ డబ్బులు రిటర్న్ వెళ్లి పోయాయని బ్యాంకు అధికారులు చెప్పారు. ఏం చెయ్యాలో రైతుకు అర్థం కాలేదు. అధికారులు సరియైన సమాచారం ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.
- మహబూబాబాద్ జిల్లా కొత్తగూడెం మండలం రైనతండఓటాయికి చెందిన రైతు, ఇండియన్ బ్యాంకులో రూ.90 వేల రుణం తీసుకున్నాడు. కానీ ఆయనకు మాఫీ కాలేదు.
- ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం టేకుపల్లి గ్రామానికి చెందిన మిట్టపల్లి పద్మావతి, పెనుబల్లి గ్రామీణ వికాస్ బ్యాంకులో రూ.1.50 లక్షల రుణం తీసుకున్నారు. కానీ మాఫీ కాలేదు.

రుణమాఫీ.. మీకు కాదయ్యా!

- వర్తించలేదంటున్న బ్యాంకర్లు
- ప్రజావాణిలో కన్నీరు పెట్టిన రైతు దంపతులు
- ఒక్క కొడుకు ఉరేసుకొని కాలమైండు
- పూటగడవడమే కష్టమైందని ఆవేదన

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, ఆగస్టు 5: 'నిరుపేదలం బిడ్డా..! పంటలు పండక దిగుబడి రాక.. బ్యాంకుల్లో అప్పులు తీసుకున్నాం.. నా కొడుకు అప్పులు చెల్లించే పరిస్థితులు లేక ఉరేసుకొని కాలమయ్యాడు. కాంగ్రెసోళ్లు రుణమాఫీ చేస్తున్నామంటే ఎంతో ఆశగా బ్యాంకు కాడికి పోతే రుణమాఫీ ఇయ్యట్లేదయ్యా..' అంటూ మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం చంద్రాస్‌పల్లి గ్రామానికి చెందిన వడ్డె మల్కమ్మ, వడ్డె చంద్రయ్య దంపతులు కన్నీరు పెట్టుకున్నారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి తన చిన్నకుమార్తె భారతమ్మతో కలిసి ఆటోలో ప్రజావాణికి వచ్చిన ఆ వృద్ధ దంపతులు గోడు వెల్లబోసుకున్నారు.

రూ.70 వేల అప్పు ఉంటే మాఫీ కాలె

హన్వాడ మండలం గుండ్యాల శివారులో తన భార్య మల్కమ్మ పేరుపై ఎకరంన్నర పొలం, తన పేరుపై నాలుగె ఎకరాల భూమి ఉన్నదని చంద్రయ్య తెలిపారు. ఈ భూమిపై బ్యాంక్‌లో ఒకసారి రూ.30 వేలు, మరోసారి రూ.40 వేలు పంట రుణం తీసుకోగా.. మొత్తం రూ.70 వేల అప్పు ఉన్నదని చెప్పారు. రుణమాఫీ కోసం బ్యాంకు అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని, రుణమాఫీ కాలేదని చెప్తున్నారని కన్నీరు పెట్టుకున్నారు. తినడానికి సైతం పూటగడవని పరిస్థితులు ఉన్నాయని, కలెక్టర్, అధికారులు స్పందించి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు.

నడవలేని స్థితిలో ఉన్న తన భర్త చంద్రయ్యకు సాయం చేస్తూ పాసుపుస్తకంతో కలెక్టరేట్‌కు వస్తున్న వడ్డె మల్కమ్మ

రుణాలు తీసుకోకున్నా తీసుకున్నట్టు మెసేజ్‌లు రావడంపై మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్‌లోని పీఏసీఎస్ కార్యాలయ సిబ్బందిని లోపలే ఉంచి తాళం వేసి నిరసన తెలుపుతున్న రైతులు

పీఏసీఎస్‌లో ఘరానా మోసం!

- రైతుల పేరిట రుణాలు కాజేసిన సిబ్బంది
- గండీడ్‌లో వెలుగుచూసిన బాగోతం
- మాఫీ మెసేజ్‌లతో విస్తుపోయిన రైతులు
- పీఏసీఎస్ ఆఫీస్‌కు తాళం వేసిన రైతులు

గండీడ్, ఆగస్టు 5: రైతులకు తెలియకుండా, ఫోర్జరీ సంతకాలతో వారి పేరిట సహకార సంఘం సిబ్బందే రుణాలు తీసుకున్న వైనం మహబూబ్‌నగర్ జిల్లాలో వెలుగు చూసింది. రైతు రుణమాఫీ నేపథ్యంలో జిల్లాలోని గండీడ్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ఈ బాగోతం బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న వెంకట్‌రెడ్డిపల్లి, కొంరెడ్డిపల్లి, సాలార్‌నగర్, పెద్దవార్వల్ తదితర గ్రామాల రైతులు సోమవారం పీఏసీఎస్‌కు తరలివచ్చారు. తాము రుణాలు తీసుకోకున్నా మాఫీ అయినట్టు మెసేజ్‌లు రావడమేమిటని సిబ్బందిని నిలదీశారు. దీనికి సహకార సంఘం సిబ్బంది నిర్లక్ష్యంగా జవాబు చెప్పడంతో ఆగ్రహించిన రైతులు వారిని కార్యాలయం లోపలే ఉంచి తాళం వేశారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తమకు రుణమాఫీ జరిగినట్టు సంఘం నుంచి నోడ్యూస్ సర్టిఫికెట్ ఇచ్చారని తెలిపారు. తర్వాత తాము ఎలాంటి రుణం తీసుకోలేదని చెప్పారు. కానీ, ఇప్పుడు కూడా రుణం మాఫీ అయినట్టు తమ ఫోన్లకు మెసేజ్‌లు రావడంతో ఆరా తీస్తే అసలు నిజం వెలుగులోకి వచ్చిందని తెలిపారు.

అప్పు కట్టించుకోని బ్యాంకులు!

- 2 లక్షలకుపైగా రుణం ఉన్న రైతులకు కొత్త చిక్కు
- ఆపై మొత్తం చెల్లిస్తేనే మాఫీ చేస్తామని సర్కార్ మెలిక
- అప్పు చేసి చెల్లింపులకు సిద్ధమవుతున్న రైతులు
- ఇప్పుడు అక్కరలేదంటున్న బ్యాంకు అధికారులు
- ఇటు ప్రభుత్వ షరతులు.. అటు బ్యాంకుల వైఖరితో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు

హైదరాబాద్, ఆగస్టు 3(నమస్తే తెలంగాణ): ఒకవైపు ప్రభుత్వ నిబంధన, మరోవైపు బ్యాంకు అధికారుల వ్యవహార శైలితో రూ.2 లక్షలకుపైగా పంట రుణాలు ఉన్న రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రూ.2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతులు ఆ పై మొత్తాన్ని బ్యాంకులకు చెల్లిస్తేనే రూ.2 లక్షలు మాఫీ చేస్తామని, లేదంటే మాఫీ వర్తించదని ప్రభుత్వం ఇప్పటికే మెలిక పెట్టింది. దీంతో ఆయా రైతులు అప్పో సప్పో చేసి, రెండు లక్షలకు మించి ఉన్న బ్యాలెన్స్‌ను చెల్లించేందుకు బ్యాంకులకు వెళ్తున్నారు. అయితే, బ్యాంకు అధికారులు మాత్రం నిరాకరిస్తున్నారనే ఫిర్యాదులొస్తున్నాయి. 'రూ.2 లక్షల కన్నా ఎక్కువ ఉన్న మొత్తాన్ని ఇప్పుడు చెల్లించాల్సిన అవసరం లేదు' అని బ్యాంకు అధికారులు చెప్తున్నట్టు తెలిసింది. సిద్దిపేట జిల్లాలో పలు బ్యాంకులు రైతులను వెనక్కి పంపించినట్టు సమాచారం. దీంతో తాము రుణం చెల్లిస్తామంటే ఎందుకు తీసుకోరంటూ రైతులు బ్యాంకర్లతో ఘర్షణలకు దిగుతున్నారు. మీరు కట్టించుకోకపోతే తమకు రుణమాఫీ ఎలా అవుతుందని నిలదీస్తున్నారు. బ్యాంకు అధికారులు మాత్రం తమకేమీ తెలియదని, తమ వద్ద ఎలాంటి సమాచారం లేదని చేతులెత్తేస్తున్నట్టు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం రూ.2 లక్షల వరకు, ఆ తర్వాత రూ.2 లక్షలకుపైగా రుణాలు గల రైతులకు రుణమాఫీ కావడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బ్యాంకు అధికారులకు ఇబ్బందేమిటి?

రైతులు రుణాలు చెల్లిస్తామంటే బ్యాంకు అధికారులు ఎందుకు తీసుకోవడం లేదనేది ఆసక్తికరంగా మారింది. దీనిపై ఆరా తీస్తే.. 'రుణ లక్ష్యం' నిబంధనల కారణంగానే బ్యాంకు అధికారులు రుణాలు కట్టించుకోవడం లేదని తెలిసింది. ఒకవైపు రుణమాఫీతో భారీగా డబ్బు బ్యాంకుల్లో జమవుతున్నది. తిరిగి రుణాలు తీసుకునేవారి సంఖ్య తక్కువగా ఉంటున్నది. దీంతో ఆయా బ్యాంకుల్లో రుణాలు తగ్గిపోతున్నాయి. ప్రతి బ్యాంకుకు రుణ లక్ష్యం ఉంటుంది. ఒకవేళ ఆ లక్ష్యం నెరవేరకపోతే బ్యాంకు అధికారుల కెరీర్‌లో ఇబ్బందులు ఏర్పడుతాయని, అందుకే బ్యాంకు అధికారులు రైతుల నుంచి డబ్బులు కట్టించుకోవడం లేదని తెలిసింది. ఇప్పటికే అరకొరగా రుణమాఫీ చేస్తున్న ప్రభుత్వం.. ఇప్పుడు ఈ నిబంధనతో ఆ కొద్ది మందికి కూడా రుణమాఫీ అయ్యే పరిస్థితి లేకపోవడం గమనార్హం. ప్రభుత్వం రుణమాఫీలో కోతలపై కోతలు పెడుతున్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు రూ.1.5 లక్షల వరకు రుణం ఉన్నవారిలో 17.75 లక్షల మందికి మాత్రమే రూ.12 వేల కోట్లు మాఫీ చేసింది. సుమారు 70 లక్షల మందికి రుణమాఫీ కావాల్సి ఉండగా అర్హతల పేరుతో 32 లక్షల మందికే పరిమితం చేసినట్టు తెలిసింది.

- మాఫీ కాలేదని బ్యాంక్ ఎదుట రైతుల ధర్నా

రుణమాఫీ వర్తించలేదని నిజామాబాద్ జిల్లా పొతంగల్ మండలం కల్లూర్ గ్రామానికి చెందిన రైతులు సోమవారం స్థానిక కెనరా బ్యాంక్ ఎదుట ధర్నా నిర్వహించారు.